శ్రీజ పసిడి వెలుగులు

కెరీర్‌లో తొలి అంతర్జాతీయ టైటిల్ • డబ్ల్యూటీటీ టోర్నీలో మెరిసిన యువ ప్యాడ్లర్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: గోవా వేదికగా జరిగిన ప్రతిష్ఠాత్మక డబ్ల్యూటీటీ ఫీడర్ కార్పస్ క్రిస్టి టోర్నీలో తెలంగాణ యువ ప్యాడ్లర్ ఆకుల శ్రీజ పసిడి వెలుగులు విరజిమ్మింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో శ్రీజ 3-0(11-6, 18-16, 11-5)తో లిలీ చాంగ్(అమెరికా)పై అద్భుత విజయం సాధించింది. రెండు సార్లు జాతీయ టీటీ చాంపియన్‌గా నిలిచిన శ్రీజ...తన కెరీర్‌లో తొలి అంతర్జాతీయ టైటిల్‌ను ఖాతాలో వేసుకుంది. మహిళల తుది పోరు పూర్తి ఏకపక్షంగా సాగింది. ఆది నుంచే తనదైన దూకుడు కనబరిచిన శ్రీజ..ప్రపంచ 46వ ర్యాంకర్ చాంగ్‌కు ఎక్కడా అవకాశమివ్వలేదు. గేమ్ గేమ్‌కు గేర్ మార్చుతూ టైటిల్‌ను ఒడిసిపట్టుకుంది. తొలి గేమ్‌లో 11-6తో ఆధిక్యం కనబరిచిన ఈ హైదరాబాదీ ప్యాడ్లర్ రెండో గేమ్‌లో ప్రత్యర్థి నుంచి పోటీ ఎదురైనా వెనుకకు తగ్గలేదు. మూడో గేమ్‌లో చాంగ్‌ను కంగుతినిపించిన శ్రీజ టైటిల్ దక్కించుకుంది. స్వర్ణం గెలిచే క్రమంలో తన(94) కంటే మెరుగైన ర్యాంక్‌లో అమెరికా ప్యాడ్లర్ అమీ వాంగ్(37)ను క్వార్టర్స్‌లో, సెమీస్‌లో జియాన్‌షాన్ జావోను శ్రీజ మట్టికరిపించింది. హోరాహోరీగా సెమీస్‌లో శ్రీజ 9-11, 11-5, 11-6, 10-12, 11-9తో జావోపై చిరస్మరణీయ విజయం సాధించింది. ఐదు గేమ్‌ల పాటు సాగిన పోరులోఈ హైదరాబాదీ యువ ప్యాడ్లర్ అద్భుత ప్రదర్శన కనబరిచింది. ఓవైపు ప్రత్యర్థి దీటుగా పోరాడుతున్నా..వెరవకుండా పోరాటపటిమ కనబరిచింది.

కష్టానికి ప్రతిఫలమిది: శ్రీజ

డబ్ల్యూటీటీ టోర్నీలో తొలిసారి టైటిల్ గెలువడం చాలా సంతోషంగా ఉంది. నేను పడిన కష్టానికి ప్రతిఫలం దక్కింది. నా కెరీర్‌లో ఇది తొలి అంతర్జాతీయ టైటిల్. టోర్నీలో క్వార్టర్స్, సెమీస్ మ్యాచ్‌ల్లో ఉత్కంఠ విజయాల తర్వాత ఇది సొంతమైంది. అమీ, లిలీ నా కంటే మెరుగైన ర్యాంక్ కల్గిన ప్లేయర్లు. వారిపై గెలువడం మరింత ఆత్మవిశ్వాసాన్నిచ్చింది.

భారత్‌కు భంగపాటు

జపాన్ చేతిలో ఓటమి • పారిస్ ఒలింపిక్స్ బెర్తు గల్లంతు

రాంచీ: భారత మహిళల హాకీ జట్టుకు భంగపాటు. ప్రతిష్ఠాత్మక పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించే అవకాశాన్ని అమ్మాయిలు చేజేతులా వదులుకున్నారు. సొంతగడ్డపై జరిగిన ఎఫ్ఐహెచ్ క్వాలిఫయర్స్ టోర్నీలో భారత్ సత్తాచాటడంలో విఫలమైంది. శుక్రవారం మూడు, నాలుగు స్థానాల కోసం జరిగిన వర్గీకరణ మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 0-1తేడాతో జపాన్ చేతిలో ఓటమిపాలైంది. కనా ఉరాట(6ని) జపాన్‌కు ఏకైక గోల్ అందించింది. దీంతో విశ్వక్రీడలకు బెర్తు దక్కించుకునే మంచి అవకాశాన్ని భారత్ చేజార్చుకుంది. గెలిస్తే తప్ప పారిస్‌కు అర్హత సాధించే అవకాశం లేని పరిస్థితుల్లో అమ్మాయిలు తుదికంటా పోరాడినా లాభం లేకపోయింది. గురువారం జరిగిన సెమీస్‌లో జర్మనీ చేతిలో ఓడిన భారత్‌కు తాజాగా జపాన్ చెక్ పెట్టింది. ఆది నుంచే దూకుడు కనబరిచిన జపాన్..భారత్ ఒలింపిక్స్ అవకాశాలపై నీళ్లు గుమ్మరించింది. మ్యాచ్‌లో తొలి రెండు క్వార్టర్‌లు జపాన్ ఆధిపత్యం ప్రదర్శిస్తే..మిగిలిన రెండు క్వార్టర్‌లో టీమ్‌ఇండియా గోల్ చాన్స్‌లను సద్వినియోగం చేసుకోలేకపోయింది. మ్యాచ్ మొత్తమ్మీద తొమ్మిది పెనాల్టీ కార్నర్లు లభించినా భారత్ గోల్స్‌గా మలువలేక మూల్యం చెల్లించుకుంది. ఎఫ్ఐహెచ్ టోర్నీలో అమ్మాయిల ప్రదర్శనపై పలువురు హాకీ అభిమానులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. టోక్యో(2020) ఒలింపిక్స్‌లో నాలుగో స్థానంలో నిలిచిన భారత్..ఈసారి కనీసం అర్హత సాధించలేక చతికిలపడింది.

తనయ్, తన్మయ్ తడాఖా

తన్మయ్ (137)

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రతిష్ఠాత్మక దేశవాళీ టోర్నీ రంజీ ట్రోఫీలో హైదరాబాద్ జోరు కొనసాగుతున్నది. సిక్కింతో జరుగుతున్న మ్యాచ్‌లో హైదరాబాద్ సంపూర్ణ ఆధిపత్యం కనబర్చింది. తొలుత సిక్కిం తొలి ఇన్నింగ్స్‌లో 79 పరుగులకే ఆలౌటైంది. మన బౌలర్లలో తనయ్ త్యాగరాజన్ 6 వికెట్లతో అదరగొట్టగా.. సీవీ మిలింద్ 4 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన హైదరాబాద్.. 3 వికెట్లు కోల్పోయి 381 పరుగులు చేసింది. ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (137; 11 ఫోర్లు, 5 సిక్సర్లు) సెంచరీతో కదంతొక్కగా.. కెప్టెన్ తిలక్ వర్మ (70 బ్యాటింగ్), రోహిత్ రాయుడు (75), రాహుల్ సింగ్ (83) హాఫ్‌సెంచరీలు చేశారు.

శ్రీనిధి అదుర్స్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: భువనేశ్వర్ వేదికగా జరిగిన కళింగ సూపర్ కప్‌లో శ్రీనిధి దక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ 4-1తేడాతో హైదరాబాద్ ఎఫ్‌సీపై ఘన విజయం సాధించింది. టోర్నీలో తమ ఆఖరి లీగ్ మ్యాచ్ ఆడిన శ్రీనిధి..హైదరాబాద్‌పై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. శ్రీనిధి తరపున ఇబ్రహీం సిస్కో, ఎలీ సబియా,లాల్‌రోమోవియా, కీన్ లెవిస్ గోల్స్ చేశారు.

శభాష్ సబలెంక

ప్రిక్వార్టర్స్ చేరిన డిఫెండింగ్ చాంప్ • జొకోవిచ్, రుబ్లేవ్ ముందంజ • ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్‌స్లామ్

సీజన్ ఆరంభ గ్రాండ్‌స్లామ్ టోర్నీ.. ఆస్ట్రేలియా ఓపెన్ అంచనాలకు తగ్గట్లు సాగుతున్నది. మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ అరియానా సబలెంక, కోకో గాఫ్ ప్రిక్వార్టర్స్‌లో అడుగుపెట్టగా.. పురుషుల విభాగంలో టాప్ సీడ్ జొకోవిచ్, రుబ్లేవ్, సిట్సిపాస్, సిన్నెర్ ముందంజ వేశారు. డబుల్స్‌లో రోహన్ బోపన్న, బాలాజీ జోడీలు విజయాలు సాధించాయి.

మెల్‌బోర్న్: డిఫెండింగ్ చాంపియన్ అరియానా సబలెంక ఆస్ట్రేలియా ఓపెన్‌లో సత్తాచాటుతున్నది. రెండో సీడ్‌గా బరిలోకి దిగిన ఈ బెలారస్ ప్లేయర్.. మహిళల సింగిల్స్ మూడో రౌండ్‌లో ప్రత్యర్థికి ఒక్క గేమ్ కూడా కోల్పోకుండా విజయం సాధించింది. శుక్రవారం జరిగిన పోరులో సబలెంక 6-0, 6-0తో సురెంకోపై గెలుపొందింది. 52 నిమిషాల్లోనే ముగిసిన పోరులో ప్రత్యర్థిని ఊపిరి మెసలనివ్వకుండా సబలెంక వరుస పాయింట్లతో రెచ్చిపోయింది. పూర్తి ఏకపక్షంగా సాగిన పోరులో సబలెంక 16 విన్నర్లు కొట్టగా.. ప్రత్యర్థి ఏడింటికే పరిమితమైంది. 6 డబుల్ ఫాల్ట్స్ చేసిన సురెంకో.. 15 అనవసర తప్పిదాలతో మూల్యం చెల్లించుకుంది. 'నా ప్రదర్శనతో సంతృప్తిగా ఉన్నా. ఈ స్థాయి విజయం కోసం చాన్నాళ్లుగా కష్టపడుతున్నా. నిరుడు ఇగా స్వియాటెక్ ఇలా (6-0) ప్రత్యర్థులపై పూర్తి ఆధిపత్యం కనబర్చింది. ఆమెను సమీపించాలనే లక్ష్యం పెట్టుకున్న నేను.. అందుకు తగ్గట్లే అడుగులు వేస్తున్నా' అని మ్యాచ్ అనంతరం సబలెంక వెల్లడించింది. మరో మ్యాచ్‌లో బడోసాపై గెలిచిన అనిసిమోవాతో.. ప్రిక్వార్టర్స్‌లో సబలెంక అమీతుమీ తేల్చుకోనుంది. ఇతర మ్యాచ్‌ల్లో అమెరికా యంగ్‌స్టర్ కోకో గాఫ్ 6-0, 6-2తో పార్క్స్‌పై.. క్రెజికోవా 4-6, 7-5, 6-3తో హంటర్‌పై.. టిమోఫీవ 7-6 (9/7), 6-3తో హద్దాద్ మయాపై విజయాలు సాధించారు.

జొకోవిచ్ అలవోకగా..

పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ జొకోవిచ్ అలవోక విజయం సాధించాడు. శుక్రవారం మూడో రౌండ్‌లో జొకో 6-3, 6-3, 7-6 (7/2)తో ఎచెన్‌వెర్రీపై గెలుపొందాడు. తొలి రెండు సెట్‌లను సునాయాసంగా దక్కించుకున్న టాప్‌సీడ్‌కు.. మూడో సెట్‌లో ప్రత్యర్థి నుంచి కాస్త ప్రతిఘటన ఎదురైనా.. ఏమాత్రం వెనక్కి తగ్గని జొకో.. బలమైన సర్వీస్‌లు, అద్భుతమైన బ్యాక్ హ్యాండ్ షాట్‌లతో ప్రత్యర్థి పనిపట్టాడు. ఇతర మ్యాచ్‌ల్లో రుబ్లేవ్ 6-2, 7-6 (8/6), 6-4తో కోర్డాపై.. సిట్సిపాస్ 6-3, 6-0, 6-4తో వాన్ అచేపై.. సిన్నెర్ 6-0, 6-1, 6-3తో బీజ్‌పై.. కచనోవ్ 6-4, 7-6 (7/4), 4-6, 7-6 (7/5)తో మచాక్‌పై గెలిచారు.

ప్రిక్వార్టర్స్‌లో బోపన్న జోడీ

భారత సీనియర్ ప్లేయర్ రోహన్ బోపన్న ఆస్ట్రేలియా ఓపెన్ ప్రిక్వార్టర్స్‌కు చేరాడు. పురుషుల డబుల్స్ రెండో రౌండ్‌లో బోపన్న-మాథ్యూ జంట 6-2, 6-4తో జాన్-ఎడ్వర్డ్‌పై గెలిచి ముందంజ వేసింది. మరో మ్యాచ్‌లో శ్రీరామ్ బాలాజీ జంట రెండో రౌండ్‌లో అడుగు పెట్టింది.

ఉస్మానియా యూనివర్సిటీ ఇంటర్ కాలేజీ జూడో చాంపియన్‌షిప్‌లో లార్డ్స్ కాలేజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ ఓవరాల్ చాంపియన్‌షిప్ దక్కించుకుంది. షోయబ్, సయీద్, అలీ, రిజ్వాన్, సోహైల్ పతకాలు కైవసం చేసుకున్నారు.

కివీస్ కేక

క్రైస్ట్‌చర్చ్: పాకిస్థాన్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో న్యూజిలాండ్ అదరగొడుతున్నది. హ్యాట్రిక్ విజయాలతో ఇప్పటికే సిరీస్ చేజిక్కించుకున్న కివీస్ శుక్రవారం నాలుగో మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. మొదట పాకిస్థాన్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 158 పరుగులు చేసింది. రిజ్వాన్ (90 నాటౌట్) టాప్ స్కోరర్. కివీస్ బౌలర్లలో ఫెర్గూసన్, హెన్రీ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం 18.1 ఓవర్లలో న్యూజిలాండ్ 3 వికెట్లకు 159 రన్స్ చేసింది. డారిల్ మిచెల్ (72 నాటౌట్), గ్లెన్ ఫిలిప్స్ (70 నాటౌట్) అర్ధశతకాలతో సత్తాచాటారు. పాక్ కెప్టెన్ షాహీన్ అఫ్రిది 3 వికెట్లు తీశాడు.

ఆస్ట్రేలియా ఘన విజయం

సిరీస్‌లో 1-0తో ముందంజ

అడిలైడ్: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ఆస్ట్రేలియా.. వెస్టిండీస్‌తో తొలి టెస్టులో 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. కంగారూ పేసర్ల ధాటికి విండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 120 పరుగులకే ఆలౌటైంది. హాజిల్‌వుడ్ 5 వికెట్లు పడగొట్టాడు. అనంతరం 26 పరుగుల లక్ష్యాన్ని ఆసీస్ వికెట్ కోల్పోకుండా ఛేదించింది. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో విండీస్ 188 పరుగులు చేయగా.. ఆస్ట్రేలియా 283 రన్స్ కొట్టింది. ట్రావిస్ హెడ్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో ఆసీస్ 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. ఇరు జట్ల మధ్య ఈ నెల 25వ తేదీ నుంచి బ్రిస్బేన్ వేదికగా డే అండ్ నైట్ టెస్టు మ్యాచ్ జరుగనుంది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.